నమస్తే తెలంగాణ
నిజామాబాద్

5 | నిజామాబాద్, సోమవారం 16 డిసెంబర్ 2024 | NIZAMABAD

మహాలక్ష్మీనగర్‌లో చోరీ జరిగిన ఓ ఇంట్లో ఆధారాలను సేకరిస్తున్న పోలీసు (ఫైల్)

ఇటీవల జరిగిన చోరీలు

- **అక్టోబర్ 14:** ఆర్మూర్‌రాంనగర్ కాలనీలోని పలు ఇండ్లలో దొంగలు దోపిడీకి పాల్పడి రూ.2.70 లక్షల నగదుతో పాటు తొమ్మిది తులాల బంగారు నగలను దోచుకుపోయారు.
- **నవంబర్ 1:** జిల్లాకేంద్రంలోని ఎన్జీవోస్ కాలనీలో నివాసం ఉండే సముద్రాల ఎల్లేశ్వరరావు దీపావళి పండుగకు ఇంటికి తాళం వేసి ఊరెళ్లాడు. దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలోని 23 తులాల బంగారు ఆభరణలతో పాటు 8 తులాల వెండి దోచుకువెళ్లారు.
- **నవంబర్ 3:** జిల్లా కేంద్రంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసిన ఇంటికి దొంగలు కన్నం వేశారు. దత్తాత్రి అనే వ్యక్తి ఇంట్లోకి చొరబడిన దుండగులు 3 తులాల బంగారం ఎత్తుకెళ్లారు.
- **నవంబర్ 5:** ఖలీల్‌వాడిలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు వరణ్య ఫార్మసీలో చొరబడి రూ.5 లక్షల నగదును ఎత్తుకెళ్లారు.
- **నవంబర్ 16:** పెర్కిట్‌లో సయ్యద్ మొయినుద్దీన్ ఇంటి తాళం ధ్వంసం చేసి, 12 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి వస్తువులతో పాటు రూ.50వేలు నగదు ఎత్తుకెళ్లారు.
- **నవంబర్ 11:** వినాయక్‌నగర్ 100 ఫీట్స్ రోడ్డులోని దత్తత్రేయ మందిరం వద్ద రాత్రి సమయంలో దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగానే కిటికీ గ్రిల్ తొలగించి బీరువాను ధ్వంసం చేసి 32 తులాల బంగారు నగలతో పాటు కిలో వెండి దోచుకుపోయారు.
- **నవంబర్ 17:** పెర్కిట్‌కు చెందిన తాజుద్దీన్ ఇంటి తాళం ధ్వంసం చేసిన దుండగులు 10 తులాల బంగారు నగలు, రూ. లక్ష నగదును దోచుకుపోయారు.
- **నవంబర్ 18:** జిల్లా కేంద్రంలోని సీతారాం నగర్ కాలనీ వద్ద ఉన్న ఏటీఎం సెంటర్‌లో చోరీకి యత్నించగా..అలారం మోగడంతో నిందితుడిని స్థానికులు పట్టుకుని ఐదో టౌన్ పోలీసులకు అప్పగించారు.
- **నవంబర్ 20:** ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి మహాలక్ష్మీనగర్‌లో అర్ధరాత్రి ఓ ఇంట్లోకి దూరిన దుండగులు ఐదుతులాల బంగారు నగలతో పాటు 20 తులాల వెండి, 10 వేల నగదు ఎత్తుకెళ్లారు.
- **నవంబర్ 28:** నగర శివారులోని సంజీవ్ రెడ్డి కాలనీలో ఉన్న ఓ ఇంట్లో వారు ఇంటికి తాళం వేసి గుడికి వెళ్లి వచ్చే సరికి బీరువాను ధ్వంసం చేసి ఆరు తులాల బంగారు నగలు, నగదు దోచుకువెళ్లారు.
- **డిసెంబర్ 3:** మూడోటౌన్ పరిధిలో కిరాణాషాపు నిర్వాహకురాలి వద్దకు సిగరెట్ కొనేందుకు వచ్చిన దుండగుడు, ఆమె మెడలోంచి రెండు తులాల బంగారు పుస్తెల గొలుసు తెంచుకుని పారిపోయాడు.

రెచ్చిపోతున్న మృగాళ్లు..

- రెంజల్ మండలంలోని ఓ తండాలో మూడురోజుల క్రితం ఎనిమిదేండ్ల బాలికపై 50 ఏండ్ల వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. నిందితుడిపై బాలిక కుటుంబ సభ్యులు దాడి చేయగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో రోజంతా తండాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మద్యం మత్తులోనే ఇలాంటి సంఘటనలు, ఇండ్లల్లో గొడవలు జరుగుతున్నాయని, వెంటనే గ్రామంలోని బెల్టు షాపు తొలగించాలని మహిళలు ఆందోళన చేశారు.
- రెంజల్ మండలంలోని ఓ గ్రామంలో శనివారం స్థానికంగా జరిగే సంతకు తల్లితో కలిసి వెళ్లిన తొమ్మిదేండ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడో దుర్మార్గుడు. స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

జిల్లాకేంద్రంలోని ఓ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

తొలిరోజు ప్రశాంతం

- ఉమ్మడి జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు ప్రారంభం
- ఉదయం, మధ్యాహ్నం నిర్వహణ
- 50 శాతం మంది అభ్యర్థులే హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు

కంఠేశ్వర్/ కామారెడ్డి, డిసెంబర్ 15 : ఉమ్మడి జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు తొలిరోజు ఆదివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తనిఖీ చేశారు. కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు మొత్తం19,855 మంది అభ్యర్థులకు 9,070 మంది హాజరుకాగా.. 10,785 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు మొత్తం 19,855 మంది అభ్యర్థులకు 9,020 మంది హాజరుకాగా..10,835 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మొత్తం నాలుగు సెషన్లలో నిర్వహించే గ్రూప్-2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు.

కామారెడ్డిలో..

కామారెడ్డి జిల్లాలోని 19 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించినట్లు రీజనల్ కో-ఆర్డినేటర్ విజయ్ కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు మొత్తం 8,085 మంది అభ్యర్థులకు 3,971 మంది హాజరు కాగా 4,114 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్షకు 50.88 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 8,085 మంది అభ్యర్థులకు 3,917 మంది హాజరు కాగా 4,168 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్షకు 51.55 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు.

జిల్లాకేంద్రంలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ

కేంద్రానికి పరిగెడుతున్న అభ్యర్థులు, ఆలస్యంగా వచ్చి మూసి ఉన్న గేట్లను చూసి నిరాశలో అభ్యర్థులు

పూర్తిస్థాయి సీపీ లేక అదుపు తప్పుతున్న శాంతిభద్రతలు

జిల్లాలో పెరిగిపోతున్న నేరాలు.. ఘోరాలు

వరుస చోరీలు.. జనం బెంబేలు

రెచ్చిపోతున్న మృగాళ్లు.. మహిళలపై అఘాయిత్యాలు

కేసుల నమోదుకే పరిమితమై ఖాకీలు

లా అండ్ ఆర్డర్ ఎక్కడ?

నిజామాబాద్ జిల్లాలో కొంతకాలంగా నేరాలు, ఘోరాలు పెరుగుతున్నాయి. వరుస చోరీలతో జనం బెంబేలెత్తగా.. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు ఏదోఒకచోట వెలుగుచూస్తుండడం ఆందోళనకు గురిచేస్తున్నాయి. జిల్లాకు పూర్తిస్థాయిలో పోలీసు బాస్ లేకపోవడంతో శాంతిభద్రతలు అదుపు తున్నాయి. ముఖ్యంగా జిల్లాకేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో దుండగులు తాళం వేసిన ఇండ్లతోపాటు దుకాణాలను టార్గెట్ చేసుకుంటున్నారు. మధ్యాహ్నం రెక్కీ నిర్వహించి, రాత్రివేళ చోరీలకు పాల్పడుతున్నారు. కొన్నిరోజులుగా మధ్యాహ్న సమయంలోనే దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఇంటి నుంచి బయటికి వెళ్లి వచ్చేలోపు ఇల్లగుల్ల చేశారని బాధితులు వాపోతున్నారు. కింది స్థాయి సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఏదైనా నేరం లేదా ఘటన జరిగిన వెంటనే నిబ్బందిని ఉరుకులు పరుగులు పెట్టించి, స్పందించే ఉన్నతాధికారి లేకపోవడంతో దారుణాలు చోటుచేసుకుంటున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

-వినాయక్‌నగర్, డిసెంబర్ 15

జిల్లాలో శాంతిభద్రతలను కాపాడడంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా వ్యవహరించిన కల్మేశ్వర్ సింగేనవార్ తనదైన ముద్రవేసుకున్నారు. ఎక్కడ ఏ చిన్న నేరం జరిగినా వెంటనే స్పందించి సిబ్బందిని అప్రమత్తం చేసే వారు. గత సెప్టెంబర్ 19న ఆయన బదిలీ అయ్యారు. దీంతో కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధూశర్మకు నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే కొంత కాలంగా శాశ్వత పోలీస్ బాస్ లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది డ్యూటీల విషయంలో తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సైతం వెలువెత్తుతున్నాయి. తమను నిలదీసే బాస్ లేకపోవడంతో జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో సంబంధిత ఎస్సైలు, సీఐలు మొదలుకొని కింది స్థాయి సిబ్బంది సైతం విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా రాత్రి పగలూ అనే తేడాలు లేకుండా దోపిడీ దొంగతనాలతో పాటు చైన్ స్నాచింగ్ ఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనలు జరగడానికి రాత్రి సమయంలో పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో పెట్రోలింగ్ లేకపోవడంతో పాటు సిబ్బంది నిఘా సైతం లేకుండా పోయిందనే విషయం స్పష్టంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది.

నిద్రావస్థలో ప్రత్యేక బృందాలు

దొంగతనం లేదా మరేదైనా నేరం జరిగితే వాటిని ఛేదించడానికి సంబంధిత ఠాణాల పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు. కానీ ఇలాంటి కేసులను ఛేదించేందుకు కమిషనరేట్ పరిధిలో సీసీఎస్ టీమ్‌తో పాటు ఐదే పార్టీ, ఇతర పార్టీలను ఏర్పాటు చేశారు. అయితే ఈ సీసీఎస్ ప్రత్యేక టీమ్ ప్రధాన లక్ష్యం కేవలం చోరీలు, లూఠీలు,ఇతర నేరాల కేసులను ఛేదించడమే. అంతేకాకుండా వీరికి లా అండ్ ఆర్డర్ విధులతో పని లేకుండా ప్రత్యేకంగా దొంగతనం కేసులను ట్రేస్ చేయడం కోసమే నియమించారు. ఇందుకోసం సీసీఎస్ టీమ్‌లో దోపిడీ, చోరీ, లూఠీ కేసులను ఛేదించిన అనుభవం ఉన్నవారినే నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఇన్ని చోరీలు, లూఠీ ఘటనలు జరుగుతున్నా, సంబంధిత ప్రత్యేక టీమ్ సిబ్బంది మాత్రం ఏ ఒక్కటి ఛేదించిన దాఖలాలు లేవు. కేసుల్లో పురోగతి లేకపోవడం చూస్తుంటే సీసీఎస్, ఐడీ పార్టీల నిఘా ఏ మేరకు పని చేస్తుందో చెప్పాల్సిన అవసరం లేదు. జిల్లాలో లూఠీలు, దోపిడీ , దొంగతనాలు ఇతర నేరాలను అదుపుచేయాలంటే జిల్లాకు పూర్తిస్థాయిలో పోలీస్ కమిషనర్‌ను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకోసం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని జిల్లాకు కొత్తబాస్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ వందఫీట్ల రోడ్డులో ఓ ఇంట్లో చోరీ చేసి పారిపోతుండగా సీసీ కెమెరాలకు చిక్కిన దుండగుల చిత్రాలు (ఫైల్)

నిజామాబాద్‌లో కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

కండ్లకు గంతలు కట్టుకుని నిరసన

కంఠేశ్వర్/ కామారెడ్డి, డిసెంబర్ 15: సీఎం రేవంత్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాల్లో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. సమ్మెలో భాగంగా ఆదివారం వారు కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం తొమ్మిది రోజులుగా నిరసనలు, సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కస్తూర్బా విద్యాలయంలో బోధన నిలిచిపోయినా కళ్లుండి కబోదిలా వ్యవహరిస్తున్నదని, అందుకే తాము కండ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు.

ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో ప్రజా సంఘాల మద్దతుతో సమ్మెను ఉధృతం చేసి, విద్యా వ్యవస్థను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సమ్మె శిబిరంలో ఉద్యోగులకు తపస్ ప్రతినిధులు మద్దతు ప్రకటించి అండగా ఉంటామన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద చేపట్టిన సమ్మె శిబిరంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, తపస్ జిల్లా నాయకులు కిషన్, నర్సయ్య, రమేశ్, సాయన్న, శివప్రసాద్, విజయ్, భూపేందర్, ప్రకాశ్, గంగామణి, అఫ్సర్, రవికిరణ్, జాన్ సత్యపాల్, గంగాధర్, ప్రభు, రాణి, సుప్రజ, పద్మ పాల్గొన్నారు. కామారెడ్డిలోని మున్సిపాల్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న సమ్మె శిబిరంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ,ఉపాధ్యాయ సంఘం నాయకులు లింగం, వేణుగోపాల్, నళిని దేవి, భగత్, సమగ్ర శిక్ష జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, రాములు, శ్రీవాణి, శైలజ, మాధవి, సరోజన, కాళిదాస్, లింగం, కవిత, బన్సీలాల్, రాజు, మౌనిక, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

చలి తీవ్రత తట్టుకోలేక జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో మంట కాగుతున్న స్థానికులు

12°

గత ఐదు రోజుల ఉష్ణోగ్రతలు ఇలా

తేదీ	ఉష్ణోగ్రతలు	
	గరిష్ఠం	కనిష్ఠం
డిసెంబర్ 11	31.9	16.2
డిసెంబర్ 12	32.3	13.8
డిసెంబర్ 13	31.1	13.9
డిసెంబర్ 14	30.3	13.8
డిసెంబర్ 15	30.9	12.0

గజ..గజ

- వణుకుతున్న ఉమ్మడి జిల్లా
- అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు
- ఉదయం 9 దాటినా తగ్గని చలి తీవ్రత
- వేకువజాము నుంచే కప్పేస్తున్న పొగమంచు
- జాగ్రత్తలు తప్పని సరి అంటున్న వైద్యులు

ఖలీల్‌వాడి డిసెంబర్ 15: ఉమ్మడి జిల్లాలో చలిపులి పంజా విసురుతున్నది. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. నిజామాబాద్ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలకు పడిపోయాయి. వేకువజాము నుంచే దట్టమైన పొగమంచు కమ్మేస్తూ ఉదయం 9 గంటలు దాటినా చలితీవ్రత తగ్గడంలేదు. దీంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 5 గంటల నుంచే చలి తీవ్రత పెరగడంతో వ్యాపారులు రాత్రి 8 గంటలకే దుకాణాలను మూసేస్తున్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

చలి కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలంటున్నారు. ఉన్నిదుస్తులు ధరించి చలి నుంచి రక్షణ పొందాలని, ఆహారం వేడిగా ఉన్నప్పుడే భుజించాలని సూచిస్తున్నారు.

నాణ్యత లేదంటూ 'సోయా' వెనక్కి

- నాఫెడ్ నుంచి తిరిగి వచ్చిన మూడు లారీలు
- రైతన్నల ఆగ్రహం.. రోడ్డుపై బైఠాయింపు

బిచ్కుంద సొసైటీ వద్ద తిరిగి వచ్చిన సోయా బస్తాల లోడ్‌తో ఉన్న లారీలు

బిచ్కుంద, డిసెంబర్ 15: సోయా రైతులు రోడ్డెక్కారు. ఐదు రోజుల క్రితం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రంలో సోయా పంటను కొనుగోలు చేసి, ఐదు రోజుల తర్వాత నాణ్యత లేదంటూ పంటను తిరిగి పంపించారు. దీంతో ఆగ్రహించిన రైతులు ఆదివారం రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. బిచ్కుంద మండలం గోపన్‌పల్లి గ్రామానికి చెందిన 20 మంది రైతులు ఈ నెల 10న బిచ్కుంద రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో సోయా పంటను విక్రయించారు. రైతులు విక్రయించిన 1200 బస్తాల సోయా పంటను (మూడు లోడ్ లారీలు) నాఫెడ్ (నేషనల్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్) అధికారులు ఆదివారం తిరిగి పంపించారు. దీంతో రైతులు సొసైటీ ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. కొనుగోలు సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి అమ్మితే ఐదురోజుల తర్వాత నాణ్యత లేదని తిరిగి పంపడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సొసైటీ అధికారులు ఉన్నతాధికారులతో మాట్లాడి, న్యాయం చేస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.